
దోమ కాటు.. ఆరోగ్యానికి చేటు



- పెరిగిన డెంగీ, చికున్ గున్యా, బోదకాలు కేసులు
- నివారణ చర్యలు పట్టని ప్రభుత్వం
- ఈ ఏడాది ఇప్పటివరకు 182 డెంగీ, 11 మందికి చికెన్ గున్యా, 8 మందికి మలేరియా నిర్ధారణ
- నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): సాయంత్రమైందంటే చాలు ఎక్కడ నుంచి వస్తాయో గానీ జుమ్మని ఇళ్లలోకి దోమలు ప్రవేశిస్తున్నాయి. ఇంట్లో గుట్టలు గుట్టలుగా నక్కి వీలు చిక్కినప్పుడల్లా మనుషులను కాటేస్తూ రక్తాన్ని తాగేస్తున్నాయి. అలాగే ప్రాణాంతక వ్యాధులకు గురిచేసి ఆస్పత్రి పాల్జేస్తున్నాయి. కొందరి ప్రాణాలు పోయేందుకు కూడా కారణం అవుతున్నాయి. ఆడ అనాలఫిస్ దోమల ద్వారానే మలేరియా వ్యాప్తి చెందుతోందని 1897 ఆగస్టు 20న సర్ రొనాల్డ్ రోస్ కనుగొన్నారు. 1902లో ఆయనకు నోబెల్ బహుమతి ప్రదానం చేశారు. ఆయన సేవలకు గుర్తుగా ఏటా ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది థీమ్ 'మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియాకు వ్యతిరేకంగా పోరాటాన్ని వేగవంతం చేయడం' అనే నినాదంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించింది.

జిల్లాలో గత రెండు నెలలుగా ముఖం చాటేసిన వరుణుడు ఈ నెలలో ప్రతాపం చూపుతున్నాడు. తత్ఫలితంగా వాగులు, వంకలు, నదులు పొంగి పొర్లుతున్నాయి. వర్షాలకు ఖాళీ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలుస్తోంది. నిరంతరాయంగా వర్షపు చినుకులు కురుస్తుండటంతో వాతావరణం చల్లగా మారిపోయింది. దోమలకు కావాల్సింది ఇలాంటి అనుకూల పరిస్థితులే. దీంతో అవి విజృంభిస్తున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రధానంగా కర్నూలుతో పాటు కోడుమూరు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు వంటి పట్టణ ప్రాంతాల్లో డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఒకవైపు టైఫాయిడ్ మరోవైపు మలేరియా జ్వరాలు అధికమవుతున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు అడుగంటాయి. పట్టణాల్లోనూ అంతంత మాత్రంగానే మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటున్నారు. దోమల నివారణకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఫలితంగా దోమల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి సీజన్‌లో ఫీవర్ సర్వే నిర్వహించేవారు. జ్వర పీడితులను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స అందించి, అవసరమైన చర్యలు చేపట్టేవారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో కేసులు త్వరగా తగ్గుముఖం పట్టేవి. ఇప్పుడు అలాంటి చర్యలే కరువయ్యాయి. కేవలం ఆసుపత్రికి వచ్చిన వారికి మాత్రమే చికిత్స చేసి పంపించే పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లలో దోమకాటు జ్వరాల వివరాలు

సంవత్సరం	డెంగీ (అనుమానిత కేసులు)	చికున్‌గున్యా (అనుమానిత కేసులు)	మలేరియా (అనుమానిత కేసులు)
2021	170 (1169)	2 (4)	10 (2,56,395)
2022	342 (4088)	0 (2)	5 (3,16,178)
2023	409 (2484)	0 (3)	2 (4,18,850)
2024	306 (2200)	10 (25)	15 (5,28,113)
2025	182 (1706)	11 (35)	8 (4,45,464)

దోమల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు



ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజల భాగస్వామ్యంతో 2030 నాటికి మలేరియా రహిత దేశంగా తీర్చిదిద్దాలని నిర్ణయం తీసుకున్నారు. లైన్ డిపార్ట్‌మెంట్ అధికారుల సహాయ సహకారాలతో దోమల నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. మలేరియా బాధితులను త్వరగా గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందేలా చేస్తున్నాం. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, ఇంటిలో నీరు నిల్వ ఉన్న పాత్రలపై మూతలు ఉంచుకోవాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. **– నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు**

పిల్లల్లో గాల్‌బ్లాడర్ వాపు వస్తుంది



సాధారణంగా పెద్దల్లో డెంగీ జ్వరం వచ్చినప్పుడు ఒళ్లునొప్పులు ఎక్కువగా ఉంటాయి. కొందరికి కడుపునొప్పి వస్తుంది. చిన్న పిల్లల్లో అయితే వారికి స్కాన్ చేస్తే గాల్‌బ్లాడర్ వాపు వచ్చి ఉంటుంది. ఇది తీవ్రంగా పరిగణించి వైద్యులను సంప్రదించాలి. మలేరియా, డెంగీకు వ్యాక్సిన్ లేదు. చలి, జ్వరం తగ్గకపోతే వైద్యులను కలవాలి. సెరిబ్రల్ మలేరియాలో చలి, జ్వరంతో పాటు రోగి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తాడు. ఇలాంటి సమయంలో వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. **– డాక్టర్ లక్ష్మీప్రసాద్, సీనియర్ జనరల్ ఫిజీషియన్, కర్నూలు**

దివ్యాంగులకు పింఛన్ నిలిపివేయడం అన్యాయం

కర్నూలు(సెంట్రల్): అర్హత కలిగిన దివ్యాంగులకు పింఛన్లు తొలగిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య విమర్శించారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఆయన సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్‌బాబులతో కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పింఛనుదారుల సంఖ్యను తగ్గించేందుకు కుయుక్తులు చేస్తోందని మండిపడ్డారు. రీవెరిఫికేషన్ పేరుతో అర్హులైన వారి పింఛన్లను తొలగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణగిరి మండలం సీహెచ్ ఎర్రగుడి పంచాయతీ పరిధిలోని సంగాలలో కురువ మాధవి పుట్టకతో దివ్యాంగురాలైనప్పటికీ పింఛన్ తొలగించారన్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నాయని, వారికి పింఛన్ ఇవ్వకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జగన్నాథం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పలువురు వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వివిధ మెడికల్ కాలేజీలకు బదిలీ చేశారు. వీరిలో డాక్టర్ వైకేసీ రంగయ్య (ఫోరెన్సిక్ మెడిసిన్) శ్రీకాకుళంకు, డాక్టర్ ఇలియాస్ బాషా (ఆర్థోపెడిక్స్) నంద్యాలకు, డాక్టర్ విజయమోహన్‌రెడ్డి (ఆర్థోపెడిక్స్) కడపకు, డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి (పీడియాట్రిక్స్) నంద్యాలకు, డాక్టర్ హరినాథరావు (రేడియాలజీ) నంద్యాలకు పదోన్నతిపై బదిలీ అయ్యారు. వీరిని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ అభినందించారు.

క్లుప్తంగా

కిక్కు దిగేలా జరిమానాల మోత

కర్నూలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి భారీగా జరిమానా విధిస్తూ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు కర్నూలు నగరంలో సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని మంగళవారం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.1.60 లక్షలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బార్లకు ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా చూడండి

కర్నూలు: నూతన బార్ పాలసీని ఆశావహులకు వివరించి ఎక్కువ మంది దరఖాస్తు చేసేలా ప్రోత్సహించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్ని జిల్లాల అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం అమరావతి నుంచి ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ, ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనాతో కలిసి అన్ని జిల్లాల ఎక్సైజ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కర్నూలులోని ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, జిల్లా అధికారి సుధీర్‌బాబుతో పాటు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. బార్ల లైసెన్స్ ప్రక్రియలో విమర్శలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. నూతన బార్ పాలసీ విధానాలను ఆశావహులకు వివరించి పెద్ద మొత్తంలో దరఖాస్తులు వచ్చేలా చూడాలని ఆదేశించారు. కల్లు గీత కుటుంబాలకు కేటాయించిన 10 శాతం బార్లకు లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పించినట్లు వివరించారు.

ట్రంప్ సుంకాలపై మోదీ మాట్లాడరేం?



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత వ్యవసాయ ఉత్పత్తులపై 50 శాతం వరకు సుంకాలు విధించినా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు మాట్లాడటం లేదని ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.జగన్నాథం విమర్శించారు. మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమెరికా, బ్రిటన్లతో చేసుకున్న రైతు వ్యతిరేక ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేష్, గిడ్డయ్యచారి, రబియా, సాగర్, మాధవి పాల్గొన్నారు.

29 నుంచి తెలుగు భాషా దినోత్సవాలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు తెలుగు భాషా దినోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, కోశాధికారి కె.రామస్వామి సంయుక్త ప్రకటనలో తెలిపారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 29వ తేదీ 'విద్యా బోధనలో తెలుగు భాష' అనే అంశంపై హైస్కూల్, కళాశాల విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. వివరాలు 99892 65632 నంబర్ వాట్సాప్ చేయవచ్చని తెలిపారు. లేదా టీజీవీ కళాక్షేత్రం కార్యాలయంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా 30వ తేదీ ఉమ్మడి కర్నూలు జిల్లా రంగస్థల కళాకారులకు పౌరాణిక, చారిత్రక ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలో పాల్గొనే కళాకారులు తాము ప్రదర్శించే పాత్రల వివరాలు జీవీ శ్రీనివాస రెడ్డి – 9291206030 లేదా గాండ్ల లక్ష్మన్న 9000385480 నంబర్లకు వాట్సాప్ చేయవచ్చని వెల్లడించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్య పనులను సంబంధిత అధికారులు సమన్వయంతో చేపట్టాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. మంగళవారం కమిషనర్ 37వ వార్డు శాంతినగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రహదారులపై వర్షపు నీరు నిల్వకుండా ఆక్రమణలు తొలగించాలన్నారు. కచ్చా కాల్వలను రూ.50 లక్షలు వెచ్చించి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. నందికొట్కూర్ రహదారి విస్తరణకు సంబంధించి మార్కింగ్ బాధితులకు ఎండార్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుడి మృతికి నివాళి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండలం ఈ.తాండ్రపాడుకు చెందిన కేడీసీఎం హమాలీ కార్మికుడు ఏసేపు మృతికి సీఐటీయూ నివాళులర్పించింది. సోమవారం మధ్యాహ్నం ఏసేపు చనిపోయిన విషయం తెలుసుకున్న ఆ గ్రామ సర్పంచ్ బాలపీర, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్, కర్నూలు మండలాధ్యక్షుడు పీబీ హుస్సేనయ్య, పాచరేలే అబ్దుల్‌దేశాయ్, నాగరాజు, మహబూబ్‌బాషా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తాం

- నిరుద్యోగ భృతి ఇంకెప్పుడు..
- యూరియా కోసం రోడ్డెక్కుతున్న రైతన్నలు
- సంపద సృష్టించడమంటే అప్పులు చేయడమేనా?



వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి పాటిల్ తిరుమలేశ్వర రెడ్డి

కర్నూలు (టౌన్): అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తామని వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి పాటిల్ తిరుమలేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఎదుర్కోలేక అలవిగాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టి 15 నెలలు దాటినా సీఎం చంద్రబాబు హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశాడన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు వచ్చేంత వరకు ప్రతి నెలా రూ.3 వేలు భృతి ఇస్తామని ఆశలు కల్పించి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రూ.4 వేలు పింఛన్, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా అనుభవం ఉందని, వైఎస్ జగన్ కంటే రెండింతలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు పదేపదే చెప్పడంతో ప్రజలు నమ్మి మోసపోయారన్నారు. విజనరీ ముఖ్యమంత్రి సంపద సృష్టి సంగతి దేవుడెరుగు.. ఏడాదిలోపే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, పెన్షనర్లు, మహిళలు ప్రభుత్వ పనితీరును గమనించాలని విజ్ఞప్తి చేశారు. రైతు సేవా కేంద్రాల వద్ద చెప్పులను వరుసలో పెట్టి రైతులు యూరియా కోసం ఎదురు చూడాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధి పనులు లేక, సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మేధావి వర్గం ఆలోచించాలని, చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తామని స్పష్టం చేశారు.

పోస్టు ఎంపిక ప్రాధాన్యతను అభ్యర్థులకే ఇవ్వాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారుకొండ సాయికుమార్

కర్నూలు (టౌన్): డీఎస్సీలో పోస్టు ఎంపిక ప్రాధాన్యతను అభ్యర్థులకే కేటాయించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారుకొండ సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని సాయి వసంత్ కాంప్లెక్స్‌లో విద్యార్థి సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025లో పోస్టు ప్రాధాన్యత ఎంపికను పరీక్షలకు ముందే ఇచ్చారన్నారు. తద్వారా 6 వేల మంది అర్హత ఉన్నప్పటికీ ఉన్నతస్థాయి పోస్టును కోల్పోవలసి వస్తుందన్నారు. ఏపీపీఎస్సీ, ఎస్ఎస్సీ లాంటి సంస్థలు సైతం ఫలితాలు వచ్చిన తరువాతనే పోస్టు ప్రాధాన్యత విధానాన్ని అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో తగు నిర్ణయం తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నాయకులు పగడాల ఆనంద్‌బాబు, రాయలసీమ జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి సాగులో పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు, నాణ్యతను పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలని వ్యవసాయ నిపుణులు సూచించారు. మంగళవారం స్థానిక అపార్డ్ స్వచ్ఛంద సంస్థ, రిలయన్స్ ఫౌండేషన్, కోరమాండల్ కంపెనీ సంయుక్తంగా ఆపార్డు కార్యాలయంలో మిర్చి రైతులతో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యాక్రమంలో వారు మాట్లాడారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడటం వల్ల మిర్చి నాణ్యత కోల్పోతుందని, ఆరోగ్యవంతమైన పద్ధతుల్లో పండిస్తే పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు మంచి నాణ్యత వల్ల అధిక ధరలు లభిస్తాయని ఆపార్డు అధినేత తిరుపతిరెడ్డి తెలిపారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి కుమార్‌స్వామి రెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మంచి వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. కోరమాండల్ ప్రతినిధులు గోవింద ఆచారి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఫొటో ఉంటేనే వార్తకు జీవం



లూయిస్ డాగురె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమాచార శాఖ డీడీ జయమ్మ, ఫొటోగ్రాఫర్లు

కర్నూలు(సెంట్రల్): దినపత్రికల్లో వార్తకు ఫొటో ఉంటేనే ప్రాముఖ్యత ఉంటుందని, జర్నలిజంలో ఫొటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని ఐఅండ్‌పీఆర్ డీడీ జయమ్మ అన్నారు. మంగళవారం ఐఅండ్‌పీఆర్ కార్యాలయ ఆవరణలో ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డె శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై కెమెరాను కనిపెట్టిన లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిత్రం అందమైన అనుభూతిని ఇస్తుందని, చాలా జ్ఞాపకాలు నెమరు వేసేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. వంద మాటలతో చెప్పలేనిది ఒక్క చిత్రంతో అర్థమయ్యేలా చేసేదే ఫొటో అని వివరించారు. ట్రెజరర్ రాము, సీనియర్ ఫొటోగ్రాఫర్లు కుమార్, కరణ్, మధు పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో గెలిచిన వారికి పాలించే హక్కు లేదు

కర్నూలు (అర్బన్): దొంగ ఓట్లతో గెలిచిన వారికి పాలించే హక్కు లేదని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా అన్నారు. దేశంలో దొంగ ఓట్లతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, దీనికి భారత ఎన్నికల సంఘం సహకరిస్తోందని కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఏఐసీసీ పిలుపుమేరకు మంగళవారం రాత్రి స్థానిక కాంగ్రెస్ నేతలు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జిలానీ బాషా మాట్లాడుతూ.. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఇక్కడ జరిగిన ఓట్ల చోరీ గురించి రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే బీజేపీ నేతలకు నిద్ర కరువైందన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ఎన్నికల కమిషన్‌ను బీజేపీ తన జేబు సంస్థగా మార్చుకుని అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 1వ తేదీ వరకు రాహుల్ గాంధీ చేపట్టిన యాత్రకు మద్దతివ్వాలని కోరారు.ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యూరియా అక్రమాలపై క్రిమినల్ కేసులు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో యూరియా ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యూరియాను రైతులకు పంపిణీ చేయకుండా అక్రమంగా మళ్లిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ షాపుల్లో అధిక ధరకు అమ్మినా, లింకేజీ పెట్టినా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బార్డర్ చెక్‌పోస్టుల్లో విజిలెన్స్, పోలీసు, రవాణా శాఖాధికారులు ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నానో యూరియాను వాడేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయధికారులకు సూచించారు. ప్రస్తుతం వచ్చిన యూరియాను రైతు సేవా కేంద్రాల్లో ఉంచి రైతులకు సక్రమంగా పంపిణీ చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, అడిషినల్ ఎస్పీ హుస్సేన్‌పీరా, జిల్లా వ్యవసాయధికారి వరలక్ష్మీ పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు జీవనోపాధులు

పొదుపు మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా జీవనోపాధి కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. జిల్లాలో 1.34 లక్షల మంది మహిళలు వ్యవసాయ శాఖకు సంబంధించి డ్రోన్‌లు, పవర్ స్ప్రేయర్లు, హార్వెస్టర్లు కావాలని కోరారని, దీనిపై ఏటలు యాక్షన్ ప్లాన్ రూపొందించి బ్యాంకుల ద్వారా అందించేందుకు కృషి చేయాలన్నారు. గొర్రెలు, మేకలు కావాలని వెయ్యి మంది, ఆవులు కావాలని 13,500 మంది విన్నవించారని వారందరినీ జాయింట్ లయబులిటీ గ్రూపులుగా ఏర్పాటు చేసి నేషనల్ లైవ్‌స్టాక పథకం కింద రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎం, పశుసంవర్ధక శాఖాధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, ఎల్‌డీఎం రామచంద్రరావు, నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, మత్స్యశాఖాధికారి రంగనాథ్, పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

రహదారుల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కర్నూలు శివారులోని ఎల్లమ్మ దేవాలయం దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని, పెద్దపాడు నుంచి హైదరాబాద్ జాతీయ రహదారిని కలుపుతూ నిర్మించే అవుటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి మునిసిపాలిటీలో ఆమోదం తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కమిషనర్ పి.విశ్వనాథ్‌ను ఆదేశించారు. ఉల్చాల రోడ్డు, గాయత్రీ ఎస్టేట్‌లలో జంక్షన్ల ఏర్పాటు పనుల్లో పురోగతి తీసుకురావాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కర్నూలు నగరంలోని వీధుల్లో రోడ్లను బాగు చేయాలని, కిడ్స్ వరల్డ్ నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డును విస్తరించాలన్నారు. నేషనల్ హైవేలో 16 బ్లాక్ స్పాట్లను గుర్తించారని, ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని పీడీని ఆదేశించారు. అనవసరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించాలన్నారు. అనంతరం జూలైలో జరిగిన ప్రమాదాలపై సమీక్షించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ.. ఆలూరు నుంచి కోడుమూరు వరకు ఉన్న రహదారిలో పెద్ద పెద్దగుంతలు ఉన్నాయని, వాటిని పూడ్చాలని కోరారు. కొత్తగా పెట్టిన సీసీ కెమెరాల నిర్వహణ సరిగాలేదని చెప్పారు. కర్నూలు నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆర్ అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, పీఆర్ ఎస్ఈ మద్దన్న, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డీటీసీ శాంత కుమారి, ఎస్‌హెచ్‌పీడీ అశోక్‌కుమార్, జతీయ రహదారుల పీడీ సునీత, ప్రభుత్వ వైద్యశాల ఏఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

కర్నూలు(హాస్పిటల్): 2027 నాటికి క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. క్యూబ్ రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ.. క్షయ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్షయవ్యాధిగ్రస్తులను ఆదరించాలని, వారి పట్ల వివక్ష, చిన్నచూపు చూడరాదన్నారు. టీబీ నిర్ధారణ అయిన వారు వైద్యుల సలహాతో ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడినట్లయితే కచ్చితంగా ఈ వ్యాధి నయం అవుతుందన్నారు. జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నిర్మూలనకు గ్రామస్థాయిలో సూక్ష్మస్థాయి కార్యాచరణ ప్రణాళికలను తీసుకుంటున్నామన్నారు. ప్రధాన మంత్రి నిక్షయ పోషన యోజన పథకం కింద నెలకు ప్రతి రోగికి రూ.1000 చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కేఎంసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డీఎస్ఎంఓ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను పారద్రోలండి

కర్నూలు కల్చరల్: సమాజం నుంచి డ్రగ్స్‌ను పారద్రోలాల్సిన అవసరం ఉందని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ షావలిఖాన్ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రగ్స్ వద్దు బ్రో (నో డ్రగ్స్ బ్రో) అనే పోస్టర్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు నూరి మన్సూర్ అలీఖాన్‌తో కలిసి ఇన్‌చార్జ్ వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు మానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి మంచి అలవాట్లను అలవర్చుకుంటే బంగారు భవితకు బాటలు వేసుకున్నట్లు అవుతుందన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబుబ్ బాషా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖలో కారుణ్య నియామకాల కింద ఒకరికి ఉద్యోగం కల్పించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉద్యోగం పొందిన పి.లక్ష్మణుడుకు సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి బీ.రాధిక నియామక పత్రాన్ని అందించారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలి ఎస్సీ బాలుర వసతి గృహంలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న సంటి రంగడు ఈ ఏడాది ఏప్రిల్ 16న మృతి చెందారన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు మృతుడి కుమారుడు లక్ష్మణుడికి కారుణ్య నియామకం కింద అవుకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు వాచ్‌మన్‌గా నియమించడం జరిగిందన్నారు. కార్యాలయ పర్యవేక్షకులు ఆలీబాషా, కేస్ వర్కర్ మునీర్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా

కర్నూలు సిటీ: ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ఓటీఎస్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన 10వ ఏపీ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఏడీపై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు మంగళవారం ఆ స్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోసెఫ్ డేవిడ్ క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ఈ.వైష్ణవిరెడ్డి, ఆర్.ఎస్వీ బలరాం, ఎస్.షేక్ జారా తస్లిం ప్రతిభ చాటి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందుకున్నారని వెల్లడించారు.

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

కర్నూలు కల్చరల్: రాజ్యాంగ సంస్థలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పీటీ సాయి ప్రదీప్ డిమాండ్ చేశారు. మంగళవారం బుధవారపేటలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు గందరగోళం సృష్టిస్తున్నాడన్నారు. అందుకు రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లుతున్నాడని ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషన్‌కు అధికారికంగా ఫిర్యాదు చేయకుండా సాకులు చెబుతున్నారన్నారు.

ఓఎస్‌లకు హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుందరికీ హెచ్‌ఆర్ పాలసీని ఇచ్చి ఉద్యోగ భద్రతను కల్పించాలని ఏపీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.మల్లయ్య, రవికుమార్ డిమాండ్ చేశారు. వారు మంగళవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా సర్వీసు రూల్స్‌ను రూపొందించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, 10 సంవత్సరాల సర్వీసు పూర్తైన వారిని కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకోవాలని, సీనియారిటీ ప్రతిపాదికన వేతనం పెంచాలని, అప్కాస్ వ్యవస్థను కొనసాగించాలని, బదిలీలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.